VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ జనవరి 02 గురువారం 2025
వెల:రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 168
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు



2లో..

ఏదో రకంగా జైలుకు పంపాలని చూస్తున్నారు
మీడియా సమావేశంలో కెటిఆర్ వ్యాఖ్యలు
పార్టీ నేతలు, అభిమానుల న్యూ ఇయర్ శుభాకాంక్షలు



మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ లేఖ

2లో



విజయవాడలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

2లో



వైజాగ్ సెంట్రల్ జైల్లో కలకలం

2లో



గాయని శివశ్రీని పెళ్లాడనున్న ఎంపీ తేజస్వి సూర్య

2లో



# ప్రజలకు చేరువైతేనే మనుగడ

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతమంది ప్రజలకు అందుతున్నాయో ఎమ్మెల్యేలు, ఎంపీలు క్షేత్రస్థాయిలో తిరిగి తెలుసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

హైదరాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతమంది ప్రజలకు అందుతున్నాయో ఎమ్మెల్యేలు, ఎంపీలు క్షేత్రస్థాయిలో తిరిగి తెలుసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తొలి ఏడాది పాలనను సమీక్షించుకుని కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత దగ్గరైతేనే ప్రజాప్రతినిధులకు మనుగడ సాధ్యమని స్పష్టం చేశారు. నూతన సంవత్సరారంభం సందర్భంగా శుభాకాంక్షలు చెప్పడానికి బుధవారం తన నివాసానికి వచ్చిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ముఖ్య నేతలతో సీఎం సమావేశమయ్యారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ఏడాది కాలంలో ప్రభుత్వ పాలన, పార్టీ పనితీరుపై వారితో చర్చించారు. కొత్త సంవత్సరంలో ముందుకెళ్లాల్సిన తీరును వివరించారు. గత ఏడాది తన పనితీరు ఎలా ఉంది.. ప్రజలు ఏమనుకుంటున్నారు.. కొత్త సంవత్సరంలో ఏం చేయాలనుకుంటున్నారో కూడా ఈ సందర్భంగా వారికి చెప్పినట్లు తెలుస్తోంది. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

**వారి సమస్యలను పరిష్కరించండి**
**ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లండి**
**మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి**

శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కాలె యాదయ్య, బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యేలు వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారని, వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రజాప్రతినిధులపైనే ఉంటుందని చెప్పినట్లు సమాచారం. రుణమాఫీ పథకానికి దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని రీతిలో ఏకంగా రూ.22 వేల కోట్లు ఇచ్చామని, ప్రతి గ్రామంలో ఎందరు లబ్ధి పొందారో చూడాలని సూచించినట్లు తెలిసింది. గతంలో కంటే భిన్నంగా తానే స్వయంగా బుధవారం ఉదయం పలువురు మంత్రులకు ఫోన్లు చేసి మాట్లాడినట్లు రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఇలా అందరూ క్షేత్రస్థాయిలో ఉండే నాయకులకు, కార్యకర్తలకు ఫోన్లు చేసి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధిగా మొదటిసారి గెలవడం గొప్ప కాదని, రెండోసారి విజయం సాధించడం చాలా ముఖ్యమంటూ.. తొలిసారి నెగ్గినవారికి ఉద్బోధించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను కలుపుకొని ముందుకెళ్లాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి వివరించాలంటూ సీఎం దిశానిర్దేశం చేశారని నేతలు తెలిపారు. గెలుపే లక్ష్యంగా గ్రూపు తగాదాలు లేకుండా పనిచేయాలని సూచించారని వారు వివరించారు.

**సీఎంకు శుభాకాంక్షల వెల్లువ**

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పలువురు మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, అభిమానులు రావడంతో జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఉదయం నుంచే సందడి నెలకొంది. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క తదితరులు ముఖ్యమంత్రిని శాలువాలతో సత్కరించారు. శుభాకాంక్షలు చెప్పినవారిలో.. ఎంపీలు మల్లు రవి, సురేశ్ షెట్కార్, బలరాంనాయక్,

చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, కాంగ్రెస్ నాయకులున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, సీఎంవో కార్యదర్శులు, వివిధ శాఖల కార్యదర్శులు, పలువురు అధికారులు ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## నగర వాసులకు రేవంత్ తీపి కబురు




2లో..

మేడ్చల్, శామీర్ పేటలకు మెట్రో పొడిగింపు
డిపిఆర్ సిద్ధం చేయాలని ఎన్వీఎస్‌రెడ్డికి ఆదేశం

## షరతుల పేరుతో రైతుల నోట్లో మట్టికొట్టే యత్నం

### రైతుభరోసాపై హరీష్ రావు విమర్శలు



**సంగారెడ్డి:** షరతుల పేరిట రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పత్తి, చెరకు, పసుపు పంటలకు ఒకసారి మాత్రమే రైతు భరోసా ఇస్తామంటున్నారు. కొండలు, గుట్టలు సాగు చేసే వారికి రైతు భరోసా రాదని చెబుతున్నారు. ఇప్పుడు రైతు భరోసాకు కూడా షరతులు పెడుతున్నారు.రైతు భరోసా కోసం రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటారంట. బడా కంపెనీలు, కార్పొరేట్ వ్యాపారులకు మాత్రం ఎలాంటి షరతులు ఉండవు. రైతులను దోషిగా నిలబెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? రైతులను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఏ దరఖాస్తు లేకుండా భారాస ప్రభుత్వం రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ నాయకుల చుట్టూ రైతులు తిరగాలని ఈ ప్రభుత్వం చూస్తోంది. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పినట్టు ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాలి.



# రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

ఫసల్ భీమా యోజన పథకం పొడిగింపు

కేటాయింపులను రూ.69,515 కోట్లకు పెంపు

డీఏపీ ఎరువుల బస్తాను రూ.1,350 లకే అందచేత

రూ.3,850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని పొడిగింపు

కేంద్ర కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్



2లో..


## "సిఎంఆర్" కళాశాల వద్ద
# ఉద్రిక్తత



గర్ల్స్ హాస్టల్ బాత్రూంలో వీడియోలు తీశారని ఆందోళన.
విద్యార్థి సంఘాల నిరసన, పోలీసుల మోహరింపు.

**వేగుచుక్క న్యూస్, మేడ్చల్, జనవరి 1:**

సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ గర్ల్స్ హాస్టల్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. గర్ల్స్ హాస్టల్లోని బాత్రూంలో సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో మొబైల్తో వీడియోలు తీశారని ఆరోపిస్తూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నిందితులను పట్టుకోవాలని విద్యార్థినిలు డిమాండ్ చేస్తూ హాస్టల్ ఆవరణలో బైఠాయించారు. ఈ విషయం తెలిసి ఏబీవీపి, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. విద్యార్థినిలు ఉదయం నుంచి ఆందోళ చేస్తున్న యాజమాన్యం స్పందించక పోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటన గతంలోనూ జరుగగా, విద్యార్థినిలు పిర్యాదు చేసిన యాజమాన్యంలో కనీస స్పందన లేదని ఆరోపించారు. వంట చేసే మేల్ వర్కర్స్ విడియోలు తీసినట్టు విద్యార్థినులు చెపుతున్నారని, వెంటనే విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి లక్షల ఫీజులు ముక్కుపిండి వసూళ్లు చేస్తున్న యాజమాన్యం, విద్యార్థినులకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని కోరారు.
పోలీసులు అక్కడకి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.







అయినప్పటికీ విద్యార్థినులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన కొనసాగించారు. కాగా పోలీసులు ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

## మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. కొత్త ఏడాది ఆరంభమైన బుధవారం, బీజేపీ రాజకీయాలకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించారు. బీజేపీ తప్పులకు ఆర్ఎస్ఎస్ మద్దతిస్తుందా? అని కేజ్రీవాల్ నిలదీశారు. 'బీజేపీ నేతలు బహిరంగంగా డబ్బులు పంచుతున్నారు. ఓట్లు కొనేందుకు ఆర్ఎస్ఎస్ మద్దతిస్తుందా? దళిత,
పూర్వాంచల్ ప్రజల ఓటర్లను పెద్ద ఎత్తున ఓటరు జాబితాల నుంచి తొలగిస్తున్నారు. ప్రజాస్వామ్యానికి ఇది మంచిదని ఆర్ఎస్ఎస్ భావిస్తుందా? ప్రజాస్వామ్యాన్ని బీజేపీ నిర్వీర్యం చేస్తోందా?' అని కేజ్రీవాల్ ఆ లేఖలో ప్రశ్నించారు. కాగా, కేజ్రీవాల్ లేఖపై బీజేపీ ఘాటుగా స్పందించింది. 'అబద్ధాలు, మోసం అనే మీ తప్పుడు అలవాట్లను వదిలిపెట్టి మీలో అర్థవంతమైన మార్పు తీసుకువస్తారని ఆశిస్తున్నాం' అని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా అన్నారు. ఈ మేరకు అరవింద్ కేజ్రీవాల్‌కు తాను లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు.

## విజయవాడలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి

అమరావతి: ఏపీలోని విజయవాడ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. విజయవాడలోని మార్టూరు మండలం దేగరమూడి సమీపంలో లారీ బైక్‌ను ఢీ కొట్టింది. బైక్‌పై వెళ్తున్న ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. మృతుల వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నగర వాసులకు రేవంత్ తీపి కబురు

**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం నగర వాసులకు తీపి కబురు చెప్పింది. మెట్రో రైలు పొడిగింపులో కీలక అడుగు వేసింది. హైదరాబాద్ ఉత్తర భాగం నగరవాసుల మెట్రో రైల్ కల నెరవేరబోతోంది. హైదరాబాద్ నార్త్ సిటీ వాసులకు నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్యారడైజ్- మేడ్చల్ (23 కిలోమీటర్లు), జేబీఎస్-శామీర్‌పేట్ (22 కిలోమీటర్లు) మెట్రో కారిడార్ల డీపీఆర్‌ల తయారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెంటనే డీపీఆర్‌లను సిద్ధం చేసి మెట్రో రైల్ ఫేజ్-2 'బి'లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో ఈ రెండు కారిడార్ల డీపీఆర్ తయారీ విషయంపై చర్చించి ఈ మేరకు సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఆర్ఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు దాదాపు 23 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రమ్‌పురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, ఆల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్‌కు 22 కిలోమీటర్ల మేర ఈ కారిడార్ విస్తరించి ఉంటుందని మెట్రో ఎండీ.. సీఎంకు వివరించారు.
మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం ట్రాఫిక్ సమస్యలపై, ఈ కారిడార్ల రూట్ మ్యాప్‌లపై తనకు మంచి అవగాహన ఉందని సీఎం ప్రస్తావించారు. రూట్ మ్యాప్ విషయంలో ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలు తీసుకోవాలని మెట్రో ఎండీని సీఎం ఆదేశించారు. డీపీఆర్ తయారీని 3 నెలల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని సీఎం సూచించినట్టు మెట్రో ఎండీ తెలిపారు. మెట్రో ఫేజ్-2 'ఏ' భాగం మాదిరిగానే 'బి' భాగాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా రూపొందించాలని సీఎం ఆదేశించినట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని.. ఈ మేరకు వెంటనే డీపీఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్ల తయారీ చేపడుతున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు.

## గాయని శివశ్రీని పెళ్లాడనున్న ఎంపీ తేజస్వి సూర్య

బెంగళూరు: దేశంలోనే అత్యంత పిన్న వయస్సు ఎంపీలలో ఒకరిగా గుర్తింపు పొందిన తేజస్వి సూర్య ఓ ఇంటివారు కాబోతున్నారు. బెంగళూరు సౌత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున వరుసగా రెండోసారి గెలిచిన తేజస్వి సూర్య.. చెన్నైకి చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్‌ను పెళ్లి చేసుకోబోతున్నారు. ఈ విషయాన్ని ఎంపీ తేజస్వి సూర్యనే బెంగళూరులో నిన్న ప్రకటించారు. మార్చి 24వ తేదీన బెంగళూరులోనే ఆయన వివాహం జరగనుంది. శివశ్రీ శాస్త్ర యూనివర్సిటీ నుంచి బయో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. మద్రాస్ యూనివర్సిటీ నుంచి భరతనాట్యంలో ఎంఏ, మద్రాస్ సంస్కృత కాలేజీలో సంస్కృతంలో ఎంఏ పట్టా పుచ్చుకున్నారు. పొన్నియిన్ సెల్వన్ పార్ట్ -2లో కన్నడ వర్షన్‌లో శివశ్రీ ఓ పాట ఆలపించారు. ఆమె యూట్యూబ్ చానెల్‌కు 2 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. తేజస్వి సూర్య వృత్తి రీత్యా లాయర్. కానీ ప్రస్తుతం ఆయన బెంగళూరు సౌత్ నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2024 ఎంపీ ఎన్నికల్లోనూ ఆయన గెలుపొందారు. 2019 ఎన్నికల్లో 3.31 లక్షల ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు. తేజస్వి చేతిలో కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ ఓడిపోయారు. 2020 నుంచి భారతీయ జనతా యువ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

## వైజాగ్ సెంట్రల్ జైల్లో కలకలం సెల్‌ఫోన్లను పాతిపెట్టిన ఖైదీలు

విశాఖపట్నం: వైజాగ్ సెంట్రల్ జైల్లో మొబైల్ ఫోన్లు దొరకడం ఏపీ వ్యాప్తంగా కలకలం రేపుతోంది. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా పెన్నా బ్యారక్ సమీపంలో పోలీసులకు నాలుగు అడుగుల లోతులో పాతిపెట్టిన ఓ ప్యాకెట్ కనిపించింది. పెన్నా బ్యారక్ సమీపంలోని పూల కుండీల వద్ద భూమిలో 4 అడుగుల లోతులో ఈ ఫోన్లను కవర్‌లో పెట్టి పాతిపెట్టారు. వాటిపై రెండు రాళ్లు కప్పి పైన పూల కుండీని పెట్టారు. అనుమానాస్పదంగా కనిపించడంతో దాన్ని పరిశీలించగా అందులో రెండు సెల్‌ఫోన్లు, ఒక పవర్ బ్యాంక్, రెండు చార్జింగ్ వైర్లు, ఫోన్ బ్యాటరీ కనిపించాయి. సెల్‌ఫోన్లు దొరకడంతో పోలీసులు అప్రమత్తమై వాటిని స్వాధీనం చేసుకున్నారు.
అయితే ఆ సెల్‌ఫోన్లలో సిమ్ కార్డులు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే ఈ విషయం తెలియగానే వైజాగ్ సీపీ శంఖబ్రత బాగ్చీ రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. సిమ్ కార్డులు దొరికన పెన్నా బ్యారక్‌లో రౌడీ షీటర్ హేమంత్ కుమార్ ఉన్నట్లుగా తెలుస్తోంది. విశాఖ సెంట్రల్ జైలు వివాదాలపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ స్పందించారు. సెంట్రల్ జైల్లో పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. వ్యవస్థలు ఏ స్థాయిలో నిర్వీర్యమయ్యాయో అర్థమవుతోందని అన్నారు. జైల్లో గంజాయి, సెల్‌ఫోన్ల ఘటనపై సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు



**హైదరాబాద్:**కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయటానికి బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో బీఆర్ఎస్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ అభిమానులు కెటిఆర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.
ఫార్ములా ఈ రేసు కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. ఫార్ములా ఈరేస్ కేసులో తెలంగాణ హైకోర్టులో ఏ తీర్పు వస్తుందో చూద్దామన్నారు. ఇందులో అవినీతే లేనప్పుడు.. కేసు ఎక్కడది అని ప్రశ్నించారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ తప్పు అని వ్యాఖ్యలు చేశారు. ఈకేసులో ఈడీ ఎదుట ఈనెల 7న హాజరుపై తన లాయర్లు నిర్ణయిస్తారని తెలిపారు. ఏసీబీ కేసులో అస్సలు పస లేదని..తనకు న్యాయస్థానాల పై నమ్మకం ఉందన్నారు. ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు అంటూ వ్యాఖ్యలు చేశారు. 'పాపం.. నన్ను ఏదో రకంగా జైలుకు పంపాలని ప్రభుత్వం చూస్తోంది. నాపై ఇది ఆరో ప్రయత్నం.. రేవంత్‌కు ఏమీ దొరకటం లేదు' అంటూ సెటైర్ విసిరారు. రూ. 600 కోట్ల సంగతి అటుంచితే.. ఒక్క పైసా కూడా అవినీతి లేదన్నారు.జడ్జి అడిగే ప్రశ్నలకు ఏజీ దగ్గర సమాధానం లేదన్నారు. రేసు కావాలని తాను నిర్ణయం తీసుకున్నాని.. వద్దనేది రేవంత్ నిర్ణయమన్నారు. ఇద్దరి నిర్ణయాలపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదన్నారు. ' నాపై కేసు పెడితే.. రేవంత్‌పై కూడా కేసు పెట్టాలి. రేవంత్ రెడ్డి.. ఒక ముఖ్యమంత్రినా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ఎదురయ్యే చిన్న, చిన్న అడ్డంకులను అధిగమించి లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం, దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 27న భారీ బహిరంగ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాది మెదటి హాఫ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. తర్వాత గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు పూర్తి చేస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడి ఎన్నికకు.. వచ్చే అక్టోబర్ వరకు సమయముందని తెలిపారు. పార్టీ నేతలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామని స్పష్టం చేశారు. రైతుబరోసాతో రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తిరుగుబాటు రాబోతోందన్నారు. రైతుభరోసా కొందరకికే ఇచ్చే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. రైతులకు సెల్ఫ్ డిక్లరేషన్ ఎందుకు అని ప్రశ్నించారు. బ్యాంకులను ముంచేటోళ్ళకే సెల్ఫ్ డిక్లరేషన్ లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజిస్ట్రేషన్లు ఇవ్వాలని రేవంత్‌కు లేదని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వమే కోర్టులో కేసులు వేయిస్తోందన్నారు. ఉద్యోగస్తులు, పాన్ కార్డ్ ఉన్నవాళ్ళకు రైతుభరోసా ఎగ్గొట్టే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.
ఃగా.. ఫార్ములా ఈరేస్ కేసుకు సంబంధించి కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఆ తీర్పు వెలువడే వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు స్పష్టం చేసింది. ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్.. హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నిన్న (డిసెంబర్ 31) విచారణ జరిపిన హైకోర్టు.. తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు ఈకేసు సంబంధించి హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి రేపు (జనవరి 2) ఈడీ ముందుకు విచారణకు హాజరుకానున్నారు. అలాగే జనవరి 3 ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ హాజరవుతారు. వీరిద్దరి విచారణ మీద ఈనెల 7 కేటీఆర్ ఈడీ విచారణకు హాజరుకావాలా వద్దే అనేదానిపై నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త



న్యూఢిల్లీ,:దేశవ్యాప్తంగా రైతుల కోసం చేపట్టిన.. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన
పథకాన్ని పొడిగించాలని కేంద్ర కేబినెట్ తీర్మానం చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ భేటీలో కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అవన్నీ రైతుల సంక్షేమం కోసమే కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పంటల బీమా పథకమైన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను మరింతగా మెరుగుపరచాలని నిర్ణయించారు. ఈ పథకం రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తెచ్చిందన్న కేంద్రం.. కేటాయింపులను రూ.69,515 కోట్లకు పెంచుతూ ఆమోదం తెలిపింది. దీంతో రైతుల పంటలకు మరింత రక్షణ లభించడంతో పాటు నష్టాల పట్ల ఆందోళన తగ్గనుంది. అలాగే, 50 కిలోల డీఏపీ ఎరువుల బస్తాను రూ.1,350 చొప్పున రైతులకు అందజేసేందుకు రూ.3,850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని పొడిగిస్తున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. 2025లో తొలి క్యాబినెట్ భేటీని ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు అంకితం చేశారన్న అశ్వినీ వైష్ణవ్.. రైతుల సంక్షేమం గురించి ఈ భేటీలో చర్చ జరిగిందన్నారు. రెండు పంటల బీమా పథకాలను కేంద్రం 2025-26 వరకు పొడిగించినట్లు తెలిపారు. వీటిని 15వ ఆర్థిక సంఘం కాలానికనుగుణంగా పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకాలకు 2020-21 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు రూ.66,550 కోట్లు కేటాయించగా.. దాన్ని 2021-22 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరాలకు గాను రూ.69,515.71 కోట్లకు పెంచారు. ఈ పంటల బీమా పథకాల అమలులో సాంకేతికతను వినియోగించేందుకు రూ.824.77 కోట్ల కార్పస్‌తో ప్రత్యేక నిధి ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఈ టెక్నాలజీ వినియోగంతో పంట నష్టం అంచనాలను త్వరగా తెలుసుకోవడంతో పాటు క్లెయిమ్ సెటిల్‌మెంట్, వివాదాలను తగ్గించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. క్యాబినెట్ నిర్ణయాలపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వం మాది. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే మన రైతులు గర్వకారణం. 2025 మొదటి క్యాబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేశాం. వారి విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు. కొత్త సంవత్సరం ప్రారంభమైన తొలి రోజు భేటీ అయిన.. ఈ తొలి కేబినెట్‌ను రైతులకు అంకితం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు.
ఇక ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల మంది రైతులు లబ్ది పొందుతున్నారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. డీఏపీ ఎరువులపై అదనపు భారాన్ని భరించాలని కేంద్రం నిర్ణయించిందని సోదాహరణగా ఆయన వివరించారు.
2014లో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి గతేడాది వరకు.. అంటే 2024 చివరి వరకు.. ఎరువుల సబ్సీడీ కింద రూ. 11.9 లక్షల కోట్లను కేంద్రం ఖర్చు చేసింది. అదే విధంగా 2024లో ముచ్చటగా మూడోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో రైతుల కోసం రూ. 6 లక్షల కోట్ల విలువైన 23 కీలక నిర్ణయాలను కేంద్రం తీసుకుంది.

## మహారాష్ట్రలో మావోలకు ఎదురుదెబ్బ

**సిఎం ఫడ్నవీస్ ఎదుట 11మంది మావోల లొంగుబాటు**

**ముంబయి:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బుధవారం గడ్చిరోలి జిల్లాలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో ఈ మావోయిస్టులు లొంగిపోయారు. అయితే లొంగిపోయిన వారిలో.. తార్కా సిడం సైతం ఉన్నారు. గడ్చిరోలిలో గతంలో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండేదని.. అలాంటి ప్రాంతంలో పోలీసులు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారన్నారు. అలాగే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గడ్చిరోలి ప్రాంతాన్ని చత్తీస్‌గఢ్‌తో అనుసంధానం చేస్తూ.. రహదారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే మొబైల్ టవర్లు సైతం నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. ఇక మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు.. ఇటీవల నాగపూర్‌లో ముగిశాయి. ఈ సమావేశాల్లో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. గత ఏడాది 33 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మరణించారని చెప్పారు. ఇక గడ్చిరోలి జిల్లా ఉత్తర భాగం పూర్తిగా మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వివరించారు. అలాగే 55 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయగా.. 33 మంది లొంగిపోయారని తెలిపారు. మావోయిస్టులపై తమ ప్రభుత్వం పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇక వామపక్ష తీవ్రవాదాన్ని అణిచివేసేందుకు మూడేళ్ల కాలపరిమి విధించుకున్నామని ఈ సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ గుర్తు చేశారు. మరోవైపు గడ్చిరోలి ప్రాంతానికి చెందిన వందలాది యువత పోలీస్ శాఖలో చేరారన్నారు. వారిలో 33 మంది యువకులు మావోయిస్టులు బాధితులు ఉన్నారని వివరించారు. ఇక మావోయిస్టుల అగ్రనేతలు సైతం లొంగి పోయి జనజీవన స్రవంతిలో కలిశారన్నారు. 2026, మార్చి మాసాంతం నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొంది. అందుకోసం తనదైన శైలిలో ముందుకు వెళ్తుంది. ఇప్పటికే దేశంలోని చాలా రాష్టాల్లో మావోయిస్టుల ప్రభావం భాగా తగ్గిపోయింది. ఇంకా సోదాహరణగా చెప్పాలంటే.. తెలుగు రాష్ట్రాలు, జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్టాల్లో వారి ప్రాబల్యం దాదాపుగా తుడిచి పెట్టుకుపోయింది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం వారి ప్రాబల్యం కొంత స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ఆ రాష్ట్రంలో సైతం భద్రత దళాలు, స్థానిక పోలీసుల సహాయంలో కూబింగ్ తీవ్రతరం చేసింది.అందులోభాగంగా పలు ఎన్‌కౌంటర్లు సైతం చోటు చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్లలో దాదాపు 27 మంది అగ్రనేతలు మరణించిన విషయం విధితమే. ఇక దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం .. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. కీలక సూచనలు చేస్తున్నారు.

## న్యూ ఇయర్ వేడుకల్లో భారీగా ఆన్‌లైన్ బిజినెస్

**న్యూఢిల్లీ:** భారత్ సహా ప్రపంచ దేశాలన్నీ 2025 సంవత్సరానికి ఆహ్వానం పలికాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భారత్‌లో ఏ వస్తువుల ఎక్కువగా ఆర్డర్ చేశారో తెలుసుకోవాలని చాలా మందికి ఆసక్తి ఉంటుంది. కొందరు ఫుడ్ ఆర్డరిస్తే, కొందరు డ్రింక్స్ పెడుతుంటారు. డిసెంబర్ 31న భారతీయులు ఎక్కువగా ఆర్డర్ చేసిన ఐటమ్స్ వివరాలను ప్రముఖ ఈ కామర్స్ దిగ్గజాలు బ్లింకిట్, స్విగ్గీ, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ షేర్ చేశాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అత్యంత ప్రజాదరణ పొందిన వస్తువుల వివరాలను నెటిజన్లతో షేర్ చేసుకున్నారు. ఊహించినట్లగానే కొత్త సంవత్సరంలో పార్టీలు బాగా జరిగాయి. దేశవ్యాప్తంగా ప్రజలు స్నాక్స్ ఎక్కువ బుక్ చేసుకున్నారు. రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్‌లో 2.3 లక్షల ఆలూ భుజియా ప్యాకెట్లు డెలివరీ అయ్యాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో సైతం గత రాత్రి 7.30 గంటలకే నిమిషానికి 853 చిప్స్ ఆర్డర్‌లు వచ్చాయి. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ లో అత్యధిక బుకింగ్స్ పాలు, చిప్స్,చాక్లెట్, ద్రాక్ష, పన్నీర్ ఐటమ్స్ ఉన్నాయని వెల్లడించింది. కూల్ డ్రింక్స్, ఐస్ క్యూబ్స్ కూడా భారీగా ఆర్డర్ చేశారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకే బ్లింకిట్ ద్వారా డెలివరీ 6,834 ఐస్ క్యూబ్స్ ప్యాకెట్లు, అదే సమయానికి బిగ్ బాస్కెట్‌లో ఐస్ క్యూబ్‌ల ఆర్డర్‌లు 1290 శాతం పెరిగాయి. 7:41 గంటల సమయంలో 119 కిలోలు ఐస్ క్యూబ్స్ డెలివరీ అయ్యాయని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. బిగ్‌బాస్కెట్‌లో నాన్ ఆల్కహాలిక్ డ్రింక్స్ విక్రయాలు 552 శాతం పెరిగాయి. డిస్పోజబుల్ కప్పులు, ప్లేట్‌ల ఆర్డర్స్ సైతం 325 శాతం పెరిగాయి. సోడా, మాక్‌టెయిల్ విక్రయాలు సైతం 200 శాతం పెరిగాయి. న్యూ ఇయర్ సందర్భంగా
అత్యధిక విక్రయాలు జరిగిన మరో ఐటమ్ కండోమ్స్. డిసెంబర్ 31 మధ్యాహ్నం వరకే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 4,779 ప్యాక్‌ల కండోమ్స్ డెలివరీ చేసింది. సాయంత్రం తరువాత నిరోధ్‌ల విక్రయాలు మరింత పెరిగాయి. బ్లింకిట్‌లో సైతం కండోమ్ అమ్మకాలు భారీగా పెరిగాయి. 1.2 లక్షల కండోమ్‌ల ప్యాకెట్లు డెలివరీ చేశామని వెల్లడించారు. లో దుస్తులు సైతం కొందరు ఆర్డర్ పెట్టడం విశేషం.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కస్టమర్ కళ్లకు గంతలు కట్టి, చేతికి సంకెళ్లు కావాలని ఆర్డర్ చేసినట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్వీట్ చేసింది. వీటితో పాటు గతంలో ఎన్నడూ లేనంతగా కూల్ డ్రింక్స్, చిప్స్ విక్రయాలు పెరిగాయంటే ఎక్కువగా ఇంట్లో కుటుంబసభ్యులతో న్యూ ఇయర్ జరుపుకున్నారని ఈకామర్స్ దిగ్గజాలు చెబుతున్నారు.

## టీమిండియా ఆటతీరుతో బేజార్

న్యూఢిల్లీ: మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి.. మరోవైపు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే అవకాశాలు పూర్తిగా సంక్లిష్టం.. ఈనేపథ్యంలో టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం పూర్తిగా వేడెక్కినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల టీమ్‌ఇండియా ఫలితాలతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆటగాళ్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్లు సమాచారం. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలోని నాలుగో టెస్టులో తీవ్రంగా నిరాశపరిచిన స్టార్‌ప్లేయర్ల ఆటతీరుపై గంభీర్ ÷ర్ అయినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. మెల్‌బోర్న్ టెస్టులో ఓటమి అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌కు తిరిగివచ్చిన ఆటగాళ్లపై అతడు మండిపడినట్లు తెలుస్తోంది. ఇక చేసింది చాలు అని పేర్కొనట్లు సమాచారం. కొంతమంది ఆటగాళ్లు పేలవ షాట్లు ఆడి వికెట్లు కోల్పోవడంపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. కోచ్‌గా బాధ్యతలు చేపట్టగానే.. ఆటగాళ్లు వారి మార్గాల్లోనే ఆడేందుకు గంభీర్ ఆరు నెలలు స్వేచ్ఛ ఇచ్చాడని.. కానీ ఇప్పుడు అదంతా ముగిసిందని పలువురు అంటున్నారు. ఇప్పటినుంచి జట్టు వ్యూహాలకనుగుణంగా ఆడనివారిపై వేటు వేసే దిశగా చర్యలు ఉంటాయని అతడు సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మ్యాచ్‌కనుగుణంగా గంభీర్ తీసుకుంటున్న వ్యూహాలకు.. మైదానంలో ప్లేయర్ల ఆటతీరుకు మధ్య పొంతన ఉండటం లేదనే దానిపై చర్చ నడుస్తోంది. ఇటీవల ముగిసిన టెస్టులో రిషభ్ పంత్ బాధ్యతారాహిత్యంగా ఆడి వికెట్ సమర్పించు కున్నాడు. అదే మ్యాచ్‌ను కోల్పోవడంలో కీలకంగా మారింది. మరోవైపు కోహ్లీ మరోసారి తన బలహీనతను చాటుకొని స్లిప్‌లో చిక్కాడు. ఇక రోహిత్ శర్మ ఏ స్థానంలో వచ్చినా.. రాణించలేకపోతున్నాడు. మెల్‌బోర్న్ టెస్టులో రెండో ఇన్నింగ్స్‌ను జాగ్రత్తగా ప్రారంభించినప్పటికీ.. చివరికీ తన పాత ఆటతీరునే కొనసాగించి విఫలమయ్యాడు. ఇలా సీనియర్ల ఆటతీరు గంభీర్‌ను బాధించిందని.. త్వరలోనే తీవ్రమైన చర్యలకు అతడు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాహుల్ ద్రవిడ్ అనంతరం హెడ్ కోచ్‌గా గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. టీమ్‌ఇండియాకు మిశ్రమ ఫలితాలే వస్తున్నాయి. శ్రీలంకతో వన్డే సిరీస్‌లో ఓటమి, స్వదేశంలో న్యూజిలాండ్‌పై వైట్‌వాష్, తాజా బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో కోచ్‌పైనా విమర్శలు వస్తున్నాయి. జట్టు ఎంపిక విషయం, వ్యూహాల్లో గంభీర్ పాత్ర ఏంటనే దానిపై పలువురు ప్రశ్నలు సంధిస్తున్నారు.

వేగుచుక్క

# జిల్లాలో 110 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు.

## - ఎస్పీ సింధూ శర్మ వెల్లడి.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 1**

: జిల్లాలో డిసెంబర్ 31 రాత్రి మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై 110 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ సింధూ శర్మ తెలిపారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 110 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, 66 వెహికల్స్ సీజ్ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.కామారెడ్డి సబ్ డివిజన్లో 60 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఎల్లారెడ్డి సబ్ డివిజన్లో 28 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, బాన్సువాడ సబ్ డివిజన్లో 22 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కేసులు ఒక్కరోజులో నమోదు చేసినట్లు తెలిపారు. ఇకపై కూడా ఎవరు మద్యం త్రాగి వాహనాలు నడపరాదని రహదారి భద్రతా నియమ నిబంధనలను పాటించి ఈ సంవత్సరం రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గే విధంగా పోలీసు శాఖ వారు తీసుకునే చర్యలలో ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు.





సిఎం కు వినయ్ రెడ్డి శుభాకంక్షలు.వేగుచుక్క న్యూస్, ఆర్మూర్ : హైదారాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్చార్జి వినయ్ రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సిఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# ఫేస్‌బుక్ ప్రియురాలి కోసం పాకిస్థాన్ వెళ్లిన భారతీయుడు..

ప్రేమకు కుల మతాలు మాత్రమే అడ్డు అనుకుంటారు చాలా మంది. కాదు దేశాలు, సరిహద్దులు కూడా అడ్డే అంటున్నారు ఈకాలం కుర్రాళ్లు. ముఖ్యంగా విదేశాలకు చెందిన అబ్బాయిలను, అమ్మాయిలను ప్రేమిస్తూ.. వారిని కలిసేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. అక్రమంగానైనా సరే దేశం దాటి వెళ్లేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు పోలీసులకు చిక్కి ఊచలు లెక్కబెడుతున్నారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి ఘటనలు బాగా పెరిగిపోగా.. తాజాగా యూపీకి చెందిన ఓ యువకుడు తన ప్రేమికురాలి కోసం పాకిస్థాన్‌కు వెళ్లాడు. చివరకు ఏమైందంటే..?

ఈమధ్య కాలంలో విదేశాలకు చెందిన అమ్మాయిలు, అబ్బాయిలను ప్రేమిస్తూ.. అనేక మంది పెళ్లిళ్లు కూడా చేసుకుంటున్నారు. ఇద్దరికీ నచ్చిన దేశంలో కాపురం పెట్టి.. తమ ప్రేమను ప్రపంచానికి చాటి చెబుతున్నారు. అలాంటి ప్రయత్నమే చేయబోయాడో భారతీయ యువకుడు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా పాకిస్థాన్‌కు చెందిన ఓ అమ్మాయిని ప్రేమించి.. ఆమె కోసం దేశ సరిహద్దులను దాటాడు. ఇప్పటికే రెండు సార్లు ప్రయత్నం చేసి ఓడిపోయిన ఇతగాడు.. తాజాగా పాకిస్థాన్‌లోకి అడుగు పెట్టాడు. వెంటనే వెళ్లి తన ప్రియురాలిని కలుసుకున్నాడు. ఇన్నాళ్లూ తన మనసులో దాచుకున్న ఊసులన్నీ చెప్పాలనుకున్నాడు. కానీ చెప్పకుండానే ఆగిపోయాడు. కాదు ఆగిపోవాల్సి వచ్చింది. ఎందుకో తెలియాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. ఉత్తర ప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన 30 ఏళ్ల బాదల్ బాబుకు గత కొన్ని సంవత్సరాల క్రితం ఫేస్‌బుక్‌లో ఓ అమ్మాయి పరిచయం అయింది. ఆమె ఎవరు, ఎలా ఉంటుందో కూడా తెలియక ముందు నుంచే ఆమెతో స్నేహం ప్రారంభించిన బాబు.. ప్రతిరోజూ ఆమెతో మాట్లాడేవాడు. ఆమె మెసేజ్ చేయనిది, ఫోన్ చేయనిదే అతడికి రోజు కూడా గడిచేది కాదు. అంతలా ఆమెకు ఆకర్షితుడు అయిన బాబు ఓ మంచి రోజు చూసుకుని తన ప్రేమ విషయం చెప్పాడు. ఆమెకు కూడా బాబు నచ్చడంతో ఓకే చెప్పింది. ఈక్రమంలోనే తాను పాకిస్థాన్‌కు చెందిన అమ్మాయిని అని వివరించింది.

అయినా సరే బాబు ఆమెను ప్రేమిస్తూనే వచ్చాడు. చాలా రోజులుగా మెసేజ్‌లు, ఫోన్ల ద్వారా ప్రేమించుకుంటున్న వీళ్లకు ఒకరినొకరు కలిస్తే బాగుండు అనిపించింది. దీంతో బాబు ప్రేయసిని కలిసేందుకు పాకిస్థాన్ వెళ్లాలనుకున్నాడు. కానీ తన వద్ద వీసా, ప్రయాణ పత్రాలు ఏమీ లేవు. అయినా సరే ప్రేయసిని కలవాలని గట్టిగా నిర్ణయించుకున్న అతడు.. అక్రమంగా పాకిస్థాన్‌లోకి ప్రవేశించాలనుకున్నాడు. ఇప్పటికే రెండు సార్లు ప్రయత్నం కూడా చేశాడు. కానీ విఫలం అయ్యాడు. అయినా పట్టుదల వీడని బాబు.. తను ప్రేమించిన అమ్మాయి కోసం రిస్క్ చేసి మరీ ఈసారి పాకిస్థాన్ బోర్డర్ దాటేసాడు. నేరుగా బహౌద్దీన్ నగరానికి వెళ్లిపోయాడు. అదే విషయాన్ని ప్రియురాలికి చెప్పగా ఆమె వచ్చి కలిసింది. ఇద్దరూ కలిసి కాసేపు ఊసులాడుకున్నారు. కానీ అంతలోనే అక్కడకు పోలీసులు వచ్చారు. బాబు ఏదో తేడాగా కనిపించేసరికి.. ఆధారాలు చూపించమన్నారు. ఇలా అతడు భారత్ నుంచి వచ్చినట్లు తెలుసుకుని డిసెంబర్ 27వ తేదీన అరెస్ట్ చేశారు. అక్రమంగా దేశంలోకి చొరబడ్డందుకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఈక్రమంలోనే అతడు తన ఫేస్‌బుక్ ప్రేమాయణం గురించి చెప్పి ఆమెను కలిసేందుకే పాకిస్థాన్ వచ్చినట్లు వివరించాడు. ఇదంతా విన్న న్యాయస్థానం బాబుకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించి, సమగ్రంగా దర్యాప్తు చేయమని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. విచారణను 2025 జనవరి 10వ తేదీకి వాయిదా వేసింది. అయితే పోలీసులు మాత్రం నిజంగానే బాబు తన ప్రేయసి కోసమే దేశం దాటి వచ్చాడా, లేక ఎవరైనా చెబితే వచ్చాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



# మన్మోహన్ సింగ్ మృతిపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని సంతాపం..

భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ డిసెంబర్ 26వ తేదీన తీవ్ర అనారోగ్యం పాలై ప్రాణాలు కోల్పోయిన విషయం అందరికీ తెలిసిందే. అయితే 92 వయసులో చనిపోయిన మాజీ ప్రధాని మృతి పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్.. మన్మోహన్ సింగ్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారత దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ డిసెంబర్ 26వ తేదీ రోజు 92 ఏళ్ల వయసులో తీవ్ర అనారోగ్యం పాలై కన్నుమూశారు. ఈయన మృతిపై దేశాధినేతలే కాకుండా.. వివిధ దేశాలకు చెందిన రాజకీయ ప్రముఖులు కూడా స్పందిస్తున్నారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారత్‌తో సత్సంబంధాలు లేని దేశాధినేతలు సైతం భారత మాజీ ప్రధాని ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ.. మన్మోహన్ సింగ్ మంచితనాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నారు. అయితే తాజాగా ఇదే పని చేశారు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని మహమ్మద్ యూనస్. ఆ పూర్తి వివరాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం. 92 ఏళ్ల వయసు కల్గిన మన్మోహన్ సింగ్ డిసెంబర్ 26వ తేదీ రోజు తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. విషయం గుర్తించిన ఆయన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఎయిమ్స్ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. ఈక్రమంలోనే చికిత్స పొందుతూ మన్మోహన్ సింగ్ మృతి చెందారు. మాజీ ప్రధాని మృతితో దేశంలోని రాజకీయ ప్రముఖులు అంతా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో 28వ తేదీన అంత్యక్రియలు నిర్వహించగా.. వేలాది మంది పాల్గొన్నారు. మన్మోహన్ సింగ్‌ను కడసారిగా చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు.

ఆ తర్వాతి రోజే మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులు ఆయన అస్థికలను యమునా నదిలో కలిపారు. మజ్ను కా తిలా గురుద్వారా సమీపంలోని అస్ట్ ఘాట్ వద్ద సిక్కు సంప్రదాయాలను అనుసరించి.. మన్మోహన్ సింగ్ పెద్ద కూతురు ఉపిందర్ సింగ్ తన తండ్రి అస్థికలను నిమజ్జనం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మన్మోహన్ సింగ్ మృతి ఏడు రోజుల పాటు సంతాప దినాలను నిర్వహిస్తోంది. ఈక్రమంలోనే తాజాగా బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్.. మన్మోహన్ సింగ్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఢాకాలోని భారత హైకమిషన్‌లో నివాళు లు అర్పించారు. మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేశారు. అనంతరం భారతదేశంలో మొదటి సిక్కు ప్రధాని అయిన మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ ఎంతో సాదాసీదాగా ఉండేవారని, ఆయన చాలా తెలివైన వారంటూ మహమ్మద్ యూనస్ చెప్పుకొచ్చారు. అలాగే సింగ్‌తో తనకు ఉన్న స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ ఉద్వేగం చెందారు. ఆపై భారత దేశాన్ని గ్లోబల్ దిగ్గజంగా మార్చడంలో సింగ్ కీలక పాత్ర పోషించారని వివరించారు. అలాగే హైకమిషన్‌లోని సంతాప పుస్తకంలో సందేశం రాశారు.



# "ఆదర్శం" ఆ ప్రధానోపాధ్యుడు.

**ఏడాదిలో మొత్తంలో ఒక్క క్యాజువల్ లీవ్ వాడుకోలేదు.**
**ప్రత్యేకత చాటుకున్న ఎచ్ ఏం. శ్రీనివాస్**
**సోషల్ మీడియా వేదికగా ప్రకటన**
**నెటిజన్ ల నుంచి వెల్లువెత్తుతున్న అభినందనలు**
**గతంలోనూ ఆదర్శ ఉపాధ్యాయుడుగా**
**రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న శ్రీనివాస్**

**వేగుచుక్క న్యూస్:సిరిసిల్ల**

ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్న ప్రధాన ఉపాధ్యాయులు చకినాల శ్రీనివాస్ అరుదైన ఘనత సాధించారు. 2024 సంవత్సరం మొత్తంలో ఒక్క క్యాజువల్ లీవ్ వాడుకోకుండా ...ఉపాధ్యాయలోకానికి స్ఫూరి గా నిలిచారుసంవత్సరంలో వేతనంలో ఎలాంటి కోతలు లేకుండా 15 రోజులను సాధారణ సెలవులు వాడుకోవచ్చు. అవకాశం ఉన్నప్పటికీ తను సాధారణ సెలవులు వాడుకోలేదు.

**సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాను**

స్కూల్ ఏచ్ ఎంగా బాధ్యతలు చేపట్టే నాటికి 40-50 మంది పిల్లలు మాత్రమే ఉండేవారు. సామర్థ్యం కంటే తక్కువ మంది పిల్లలతో ఉన్న స్కూల్ లో ప్రవేశాలు పెంచేందుకు కంకణం కట్టుకున్న శ్రీనివాస్






.... మొదట విద్యా బోధనను మెరుగు పరిచారు . షెడ్యూల్ ప్రకారం పాఠాలు జరిగేలా పర్యవేక్షణ చేశారు. కంప్యూటర్ ల్యాబ్ ను ఏర్పాటు చేశాడు. వేసవిలో ఆంగ్లం లో నైపుణ్యాలు పెంపుదలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు.పాఠ్యేతర కార్యక్ర మాల లో కూడా విద్యార్థులు చురుగ్గా పాల్గొనే చేశాడు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహి ంచారు. ఇలాంటి కార్యక్రమాలతో క్రమం గా విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలపై నమ్మకం పెరిగింది. స్కూల్ లో ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగింది. 260 కి పైగా విద్యార్థుల ప్రవేశాలు జరిగాయి. పాఠశాల సమగ్రాభివృద్ధి చేసిన కృషికి గుర్తింపుగా హెచ్ఎం చకినాల శ్రీనివాస్ కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం లభించింది. ఇంతటితో ఆగకుండా శ్రీనివాస్ పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలలోనీవిద్యార్థులకు సైకిల్ లు, బ్యాగ్ లు అందజేశారు. త్రాగునీటి వసతి, తదితర మౌలిక సదుపాయాల పెంపుద లకు కృషి చేశారు.



# ఒక్కసారిగా దూసుకెళ్లిన షేర్ ధర..!

స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే వారికి అలర్ట్. కొన్ని స్టాక్స్ కొన్ని ప్రత్యేక సందర్భాల్లో దూసుకెళ్తుంటాయి. ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, అమ్మకాలపై ఆధారపడి ఇది ఉంటుంది. కొన్ని ప్రకటనలు వస్తే.. ఊహించని రీతిలో డిమాండ్‌తో స్టాక్స్ దూసుకెళ్తుంటాయన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఒక కంపెనీ బోనస్ షేర్లు ప్రకటించగా.. రికార్డు తేదీ దగ్గరపడుతున్న వేళ ఒక షేరు ఇంట్రాడేలో 10 శాతం దూసుకెళ్లింది.

సూర్య రోష్ణీ లిమిటెడ్ స్టాక్ మంగళవారం (డిసెంబర్ 31) సెషన్లో అదరగొట్టింది. ఇంట్రాడేలో ఒక దశలో 10 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టి రూ. 617.90 వద్ద గరిష్టాన్ని తాకింది. తర్వాత కాస్త వెనక్కి తగ్గి చివరకు 5.52 శాతం లాభంతో రూ. 592 వద్ద సెషన్ ముగించింది. అంతకుముందు సెషన్లో ఇది రూ. 561.05 వద్ద సెషన్ ముగించింది. ఇక కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 6.45 వేల కోట్లకు చేరుకుంది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 841.65 కాగా.. కనిష్ట ధర రూ. 467.55 గా ఉంది. దీంతో.. ఇవాళ ఒక్కసారిగా దూసుకెళ్లగా.. ఇందులో డబ్బులు పెట్టిన ఇన్వెస్టర్లకు మంచి లాభాలు అందాయని చెప్పొచ్చు. దీని గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం. స్టాక్ ఎందుకు ఒక్కసారిగా ఎగబాకిందో చూద్దాం.

ఫ్యాన్స్, స్టీల్, లైటింగ్, సహా కిచెన్ సామగ్రి, పీవీసీ పైప్స్ వంటి ప్రొడక్ట్స్ తయారుచేసి విక్రయిస్తుంటుంది సూర్య రోష్ణీ కంపెనీ. దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది. ఎల్ఈడీ లైట్స్ ఉత్పత్తిలో దేశంలోని అతిపెద్ద కంపెనీల్లో ముందువరుసలో ఉంది. ఇంకా 44 దేశాలకు పైగా తన ఉత్పత్తుల్ని ఎగుమతి చేస్తుంటుంది. ఇక ఈ కంపెనీ ఇటీవలే ఇన్వెస్టర్లకు, షేర్ హోల్డర్లకు బోనస్ షేర్లను ప్రకటించింది. కొద్ది రోజుల కిందట 1:1 నిష్పత్తిలో బోనస్ ఇష్యూ ప్రకటించగా.. ఇందుకు రికార్డు డేట్ 2025, జనవరి 1 గా పేర్కొంది. అంటే ఆలోపు ఈ కంపెనీలో షేర్లు కలిగి ఉన్న వారికి.. బోనస్ షేర్లు వర్తిస్తాయన్న మాట. అందుకే.. ముందురోజు అయిన ఇవాళ (డిసెంబర్ 31) ఒక్కసారిగా కొనుగోళ్లు పెరిగాయి. షేరు ధర కూడా పుంజుకుంది. 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు అంటే.. ఇన్వెస్టర్ల దగ్గర ప్రతి ఈక్విటీ షేరుకు అదనంగా మరో షేరు లభిస్తుంది. అంటే ఉదాహరణకు షేర్ హోల్డర్ 100 షేర్లను కలిగి ఉంటే.. అప్పుడు మరో 100 షేర్లు ఉచితంగానే వస్తాయి. అదనంగా ఎలాంటి పెట్టుబడి పెట్టాల్సిన పని లేదు. అయితే.. దీనికి అనుగుణంగానే షేరు ధర మాత్రం రికార్డు డేట్ తర్వాత తగ్గుతుందని చెప్పొచ్చు. కంపెనీ మార్కెట్ విలువలో కూడా ఎలాంటి మార్పు ఉండదు. కనిష్ట స్థాయిలో షేరు అందరికీ అందుబాటులో ఉండి.. మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందనే అంచనాతో ఇలా బోనస్ షేర్లను ప్రకటిస్తుంటాయి కంపెనీలు. జనవరి 1 రికార్డ్ డేట్ అంటే.. బోనస్ షేర్లు జనవరి 2న ఇష్యూ చేస్తారు. స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇవి జనవరి 3న లిస్టవుతాయని కంపెనీ స్పష్టం చేసింది. ఈ కంపెనీ బోనస్ షేర్లను ప్రకటించడం ఇదే తొలిసారి.

# కొత్త సంవత్సరంలో హోం లోన్ తీసుకోవాలనుకుంటున్నారా?




సొంత ఇల్లు కొనుగోలు చేయాలన్నా.. కట్టుకోవాలన్నా చాలా మంది లోన్ల కోసం చూస్తుంటారు. చాలా బ్యాంకులు ఇప్పుడు హోం లోన్లు ఆఫర్ చేస్తుంటాయి. అయితే వడ్డీ రేట్లు మాత్రం.. బ్యాంకుల్ని బట్టి వేర్వేరుగా ఉంటాయని గుర్తుంచుకోవాలి. ఇంకా ఎన్నో విషయాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఏయే అంశాల్ని పరిశీలించాలో ఇప్పుడు తెలుసుకుందాం.

గృహ రుణం: చాలా మంది ఇంటిని సొంతం చేసుకోవాలనుకునే కలను నెరవేర్చుకునేందుకు బ్యాంకు లోన్‌పై ఆధారపడతారు. అయితే వీరు హోం లోన్ దరఖాస్తు చేసే ముందు కొన్ని విషయాల్ని పరిశీలించాల్సి ఉంటుంది. అవేంటో మనం ఇప్పుడు చూద్దాం. ముందుగా క్రెడిట్ స్కోరు కీలకంగా ఉంటుంది. మీ క్రెడిట్ స్కోరు రుణ దరఖాస్తుపై నేరుగా ప్రభావం చూపుతుందని చెప్పొచ్చు. బ్యాంకులు 700 లేదా అంతకంటే ఎక్కువ స్కోరు కలిగి ఉన్న దరఖాస్తుదారులకు ప్రాధాన్యం ఇస్తాయన్న సంగతి తెలిసిందే. కాబట్టి.. మీ క్రెడిట్ హిస్టరీ, క్రెడిట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టును లోన్‌కు దరఖాస్తు చేసే 6 నెలల ముందు నుంచే తప్పనిసరిగా చెక్ చేసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా హోం లోన్ కోసం దరఖాస్తు చేసినప్పుడు బ్యాంకులు.. దరఖాస్తుదారుల అకౌంట్ స్టేట్‌మెంట్స్ తీసుకుంటాయి. గత 6 నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్ ఆధారంగా బ్యాంకులు మీ రీపేమెంట్ సామర్థ్యం అంచనా వేస్తాయి. మీ అకౌంట్ సగటు బ్యాలెన్స్ కనీసం హోం లోన్ ఈఎంఐకి సమానంగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది.

చాలా మంది హోం లోన్ తీసుకునేటప్పుడు ఇంటి విలువకు సరిపడా మొత్తం లోన్ పొందొచ్చని అనుకుంటుంటారు. కానీ బ్యాంకులు ఇంటి విలువలో కనీసం 10 నుంచి 20 శాతం మొత్తాన్ని డౌన్ పేమెంట్ చెల్లించాలని అడుగుతాయి. మిగతా మొత్తానికి సరిపడా లోన్ అందిస్తాయి. అందుకే.. ఈ డౌన్ పేమెంట్ మొత్తం సమకూర్చుకునేందుకు ముందు నుంచే పొదుపు చేయడం ఉత్తమం.

ఇక రూ. 50 లక్షల హోం లోన్‌ను 20 ఏళ్ల కాల వ్యవధితో ప్రస్తుత 9 శాతం వడ్డీ రేట్ల ప్రకారం చూస్తే ఈఎంఐ దాదాపుగా రూ. 45 వేలు పడుతుంది. అందుకే.. లోన్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు దాదాపుగా ఈ మొత్తాన్ని ఈఎంఐగా చెల్లించేందుకు సిద్ధపడి ఉంటేనే లోన్ కోసం అప్లై చేయాలి. కొన్ని బ్యాంకులు మీ ఇంటి పత్రాల్ని వారి వద్ద డిపాజిట్ చేయమని.. దీని కోసం రిజిస్ట్రేషన్ కూడా చేయించమని కోరుతుంటాయి. దీనినే మెమోరాండమ్ ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్ అంటారు. లోన్ మొత్తంలో ఇది 0.5 శాతం నుంచి 0.60 శాతం వరకు ఉంటుంది.

మరీ ముఖ్యంగా హోం లోన్ తీసుకునే ముందుగా పలు బ్యాంకులు అందిస్తున్న వడ్డీ రేట్లు, ఆఫర్లను పోల్చుకోవాలి. దీని కోసం సమగ్ర ఆన్ లైన్ పరిశోధన చేయాలి. బ్యాంకులు కొన్ని పండగ సీజన్లలో ప్రాసెసింగ్ ఛార్జీల్ని మాఫీ చేస్తుంటాయి. ఇంకా వడ్డీ రేట్లపైనా డిస్కౌంట్లు ప్రకటిస్తుంటాయి. మరోవైపు ఫ్లోటింగ్ లేదా ఫిక్స్‌డ్ రుణాల వడ్డీ రేట్ల గురించి కూడా స్పష్టంగా తెలుసుకోవాలి. వీటి గురించి ముందుగానే తెలుసుకొని అప్పుడు సరైన లోన్ ప్లాన్ ఎంచుకోవాలి.

# యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అవసరం.

**ప్రముఖ ఎన్నారై, రామ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నోముల రామచంద్రారెడ్డి.**

**దివ్యాంగుల వృత్తి శిక్షణ కేంద్రాం ఏర్పాటుకు ఆర్థిక సహాయం.**

**స్నేహ సొసైటి లో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు.**










**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 1:**

యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అవసరమని ప్రముఖ ఎన్నారై, రామ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నోముల రామచంద్రారెడ్డి అన్నారు. స్నేహ సొసైటీ స్వచ్ఛంద సంస్థ పై ఉన్న నమ్మకంతో వయో మానసిక దివ్యాంగుల ఉన్నతి కోసం వృత్తి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సహాయం అందజేసినట్టు ఆయన తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను దివ్యాంగ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, ప్రముఖ ఎన్నారై నోముల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులతో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువతకు నైపుణ్యాభివృద్ధి అవసరమని తెలిపారు.. దివ్యాంగుల వయో మానసిక దివ్యాంగుల ఉన్నతి కోసం తన వంతు బాధ్యతగా వృత్తి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు తన వంతుగా లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందని తెలిపారు. ఈ ఈ వృత్తి శిక్షణా కేంద్రంతో మానసిక దివ్యాంగులు వారి కాళ్లపై వారు నిలబడగలుగుతారని ఆయన తెలిపారు.. వృత్తి శిక్షణా కేంద్రాన్ని స్నేహ సొసైటీలో ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.. స్నేహ సొసైటీ పై ఉన్న నమ్మకంతో ఎంతోమంది దివ్యాంగులు ఉన్నత శిఖరాలు అధిరోహించారని అన్ని పరిగణలోకి తీసుకొని ఈ వృత్తి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్టు ఆయన తెలిపారు. అనంతరం స్నేహ సొసైటీలో ఆశ్రయం పొందుతున్న ఆరుగురు అనాధ దివ్యాంగులతో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనాధ దివ్యాంగుల్లో సైతం మానసిక ధైర్యం పెంచి, ఆత్మ న్యూన్యత భావన తొలగించి వారిలో మనోధైర్యం పెంచేందుకు స్నేహ సొసైటీ కృషి చేయడం వారి పనితీరుకు నిదర్శనం అన్నారు. అనాధ దివ్యాంగుల అయినప్పటికీ వారికి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పుట్టినరోజు

వేడుకలు జరపడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మానసిక దివ్యాంగులు అందులో

యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ నూతన సంవత్సర వేడుకల్లో స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి ఎస్. సిద్ధయ్య వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి, రామ్ నోముల చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి వాసు గౌడ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ జీవన్ దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్బన్ అభివృద్ధికి రూ" 60 కోట్లు మంజూరు.

**సిఎం కు నూడ చైర్మన్ కేశ వేణు కృతజ్ఞతలు**

**గతంలో కవిత ఎంపీ గా నిజామాబాద్ కు చేసిన అభివృద్ధి ఏమీ లేదని వెల్లడి.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 1**

: అర్బన్ అభివృద్ధికి రూ" 60 కోట్లు మంజూరు అయ్యాయని, అందుకు
సిఎం కు నూడ చైర్మన్ కేశ వేణు కృతజ్ఞతలు తెలిపారు మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు, నూడ చైర్మన్ కేశ వేణు విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కేశ వేణు మాట్లాడుతూ, సిఎం నగర అభివృద్ధికి రూ" 60 కోట్ల తో పాటు అమృత్ స్కీం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కొరకు 400 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోని ప్రజలకు ఇచ్చిన హామీలలో దాదాపు 80% హామీలను పూర్తి చేయడం జరిగిందని, కానీ గతంలో టిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత నిజామాబాద్ కు చుట్టపు చూపుగా వచ్చిన కవిత రాష్ట్రంలో నిజామాబాద్ అర్బన్ లో అభివృద్ధి జరగడం లేదని మాట్లాడుతున్నారని, గతంలో కవిత ఎంపీగా ఉన్నప్పుడు నిజామాబాద్ లో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయలేదని, కేవలం ముఖ్యమంత్రి కూతురుగా హోదను మాత్రమే అనుభవించిందని, ప్రజల గురించి ఏ రోజు ఆలోచించలేదని ఆయన అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిజాంసాగర్ ఫ్యాక్టరీ మూత పడిందని, ఆ సమయంలో ఎంపీగా ఉన్న కవిత ఏ రోజు మాట్లాడలేదని ఆన్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తుందని ఆయన తెలిపారు. అదే విధంగా బిజెపి ఎంపీ అరవింద్ తనకు మోడీతో దగ్గర సంబంధం ఉంది అని చెప్తున్నాడని, నిజామాబాద్ పార్లమెంటు లో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా తీసుకురాలేదని, కేవలం ప్రగల్బాలు పలకడానికి
ఆరవింద్ సరిపోతున్నాడని, ఇకనైనా ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం,ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షల వరకు పెంపు,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించామని,దాదాపు 90 రైతులకు 2 లక్షలోపు రుణమాఫీ చేశామని అన్నారు.మరొక్క సారి కవిత కాంగ్రెస్ ప్రభుత్వం పై అబద్ధపు మాటలు పట్లడితే మహిళా కాంగ్రెస్ నాయకులు తరిమి కొడతారని కేశ వేణు అన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి.







**డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల.**

**మోపాల్ బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 1:**

ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని నిజామాబాద్ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో మోపాల్ మండల కేంద్రంలో గల బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు రోడ్డు భద్రత మీద అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకుని ప్రయాణం చేయాలని, లైసెన్స్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. ఫోర్ వీలర్ దారులు సీట్ బెల్ట్ పెట్టుకొని వాహనాన్ని డ్రైవింగ్ చేయాలన్నారు. ముఖ్యంగా డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్ ఫోన్ మాట్లాడకూడదన్నారు. హైవేపై ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్క వాహనదారుడు పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో
ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిరణ్, రాహుల్, శ్రీనివాస్, జిల్లా ఐరాడ్ మేనేజర్ వర్షా నిహాంత్, వసతి గృహ సంక్షేమ అధికారి అశోక్ పాల్గొన్నారు.

# జైలు నుంచి వచ్చినోళ్ళు "క్రైమ్ రేట్" పెరిగిందంటున్నారు.

**మహిళ అయి ఉండి లిక్కర్ వ్యాపారం.**

**గుట్కా దందా, బియ్యం అక్రమ వ్యాపారంలో ఎవరు ఉన్నారో ప్రజలకు తెలుసు.**

**ఎమ్మెల్సీ కవిత పై షబ్బీర్ అలీ ఘాటు వ్యాఖ్యలు.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 1:**

జైలుకుపోయి వచ్చిన నాయకులు క్రైమ్ రేట్ పెరిగిందని మాట్లాడుతున్నారని, ఒక మహిళ అయి ఉండి లిక్కర్ వ్యాపారం చేసి అందరిని తాగుబోతులుగా మార్చి క్రైమ్ రేట్ పెంచారని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వెల్ఫేర్ వర్గాల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఎమ్మెల్సీ కవిత పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. షబ్బీర్ అలీ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ మేరకు పేర్కొన్నారు.

గుట్కా దందా, ఇసుక దంద, అక్రమ బియ్యం వ్యాపారం చేసేవారు ఏ పార్టీ వారో నిజమాబాద్ ప్రజలందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు.

నిజామాబాద్ నగర అభివృద్ధి కొరకు టియుఎఫ్ ఐడిసి నిధులు 60 కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి తో ప్రత్యేకంగా మాట్లాడి నిధులు మంజూరు చేయించాను అని పేర్కొన్నారు. నగరంలోని దాదాపు అన్ని డివిజన్లకు డ్రెయిన్, సీసీ రోడ్లు కల్వర్టులు, అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక సంవత్సర కాలంలో 55 వేల ఉద్యోగాలు ఇచ్చాం అని, ఇంకో 50,000 ఉద్యోగాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం అని అన్నారు.

బిజెపి నాయకులు మాటలు చెబుతారు గాని అభివృద్ధి చేయరని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఎన్ని ఇచ్చాడు, ప్రతి ఖాతాలో 15 లక్షలు నల్లధనం వేస్తానని ఎంతమందికి వేశాడు అని ప్రశ్నించారు. దేశాన్ని దోపిడీ చేసి పారిపోయిన ఎగవేత దారులను దేశానికి తిరిగి తెప్పిస్తానని ఎంతమందిని తీసుకొచ్చారని అన్నారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వం మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి 8 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. వారే రైతులకు రుణమాఫీ కాలేదు
అంటూ గగ్గోలు పెడుతున్నారని,
మీరు అధికారంలో ఉన్నప్పుడు 10 సంవత్సరాల్లో రుణమాఫీ ఎంత చేశారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీ చేసి 21వేల కోట్లు రైతులకు రుణమాఫీ చేసాం అని మిగతా వారికి కూడా చేస్తాం అని అన్నారు. సంక్రాంతి కి రైతు భరోసా కూడా అందజేస్తాం అని,
ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇల్లును సాంక్షన్ చేసిందని అన్నారు.

రాష్ట్రం మొత్తం 25 లక్షల నిరుపేదలకు ఇల్లు అందిస్తున్నమని, దానికోసం 12వేల 500 కోట్లు నిధులు విడుదల చేస్తున్నాం అని అన్నారు.

# నేడు ఏకసభ్య కమిషన్ రాక.

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి.**



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 01**

ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ ఈ నెల 2న (గురువారం) ఉదయం 11.00 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్), నిజామాబాద్ నందు ఉపవర్గీకరణ, వివరణాత్మక అధ్యయనం కోసం విచ్చేస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు.

నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కులానికి చెందిన వారు హాజరై, తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ తో కూడిన ఏక సభ్య కమిషన్ కు దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. ఎస్సీ కులానికి చెందిన ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, షెడ్యూల్డు కుల సంఘాల నాయకులు, ఇతర ఉద్యోగులు, ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కులానికి చెందిన అన్ని వర్గాల వారు హాజరై ఏకసభ్య కమిషన్ కు తమ తమ వినతులు అందజేయాలని అన్నారు.